సమస్యల వలయంలో బీసీ కాలనీ

- ఇబ్బందుల్లో కాలనీ వాసులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): కాలనీలో సమస్యలు ఏళ్ల కాలంనుంచి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కానీ వారి సమస్యలను పరిష్కరించే వారు కరువయ్యారు. కాలనీలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. జిన్నారం మండలం, బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీలో సుమారు 350 కుటుంబాలు ఉన్నాయి. ఏళ్ల కాలం నుంచి సమస్యలు తీవ్రంగా ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా నీటి సమస్య, పారిశుధ్యం లోపిస్తుంది. తాగు నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు బయట నుంచి నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఒక్కొక్క వాటర్ క్యాన్ రూ.15 నుంచి 25లు వెచ్చించి కొనాల్సిన దుస్థితి నెలకొంది. కూలీ పనులతో పాటు, పరిశ్రమల్లో పనులకెళ్లే తాము మంచి నీటిని కొని తాగాలంటే ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్టు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్గరోడ్లు, మురికి కాలువల నిర్మాణాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నా పట్టించుకునే వారు లేరు. ఇళ్ల నుంచి వెలువడుతున్న మురుగు రోడ్లపై పారుతుంది. అధికారులు మురుగు నీరు పోవడానికి ప్రత్యేకమైన కాల్వ అంటూ నిర్మాణం చేపట్టలేదు. ఇండ్లనుంచి వెలువడే నీరు రోడ్లమీదా పారాల్సిందే అక్కడ దోమలు చేరాల్సిందే. వ్యాధుల బారిన తాము పడాల్సిందేనని చెబుతున్నారు. దీంతో ఇక్కడ అపరిశుభ్రం తయారవుతుంది. పరిసరాల పరిశుభ్రత ఇక అంతే సంగతులు. మున్సిపాలిటీకి కోట్ల రూపాయాల ఆదాయం ఉన్నా కాలని అభివృద్ధికి ఎందుకు కేటాయించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కాలనీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.



బీసీ కాలనీలో రోడ్ల దుస్థితి

సమస్యలపై పోరాటం చేస్తూనే ఉన్నాం



కాలనీలో సమస్యలను పరిష్కరించేలా నిధులు కేటాయించాలని ఎప్పటికప్పుడు అధికారులను సూచిస్తున్నాం. అధికారులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.

– గోపాలమ్మ, కౌన్సిలర్, బొల్లారం

క్లుప్తంగా

జాతరకు రావాలని హర్యానా గవర్నర్‌కు ఆహ్వానం



జాతర ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నందీశ్వర్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: 26వ తేదీన నిర్వహించే రేణుక ఎల్లమ్మ జాతరకు రావాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను ఆలయ కమిటీ ఆహ్వానించారు. పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత నందీశ్వర్ గౌడ్ గవర్నర్ వద్దకు మంగళవారం వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి అనంతరం జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు.

మైనార్టీల సంక్షేమానికి నిధులు మంజూరు

హత్నూర (సంగారెడ్డి): మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే మదన్ రెడ్డికి మండల మైనార్టీల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మంగళవారం తెలిపారు. హత్నూర గ్రేవియార్డ్ ప్రహరీ గోడా నిర్మాణానికి రూ.26లక్షలు, ఎల్లమ్మ గూడా మైనార్టీల గ్రేవియాడ్‌కు రూ.15 లక్షలు, పల్పనూర్‌కు రూ.10 లక్షలు, కాసాలకు రూ.11 లక్షలు, మల్కాపూర్‌కు రూ.5 లక్షలు మంజూరయ్యాయని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ముగిసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాలు



ఉత్సవాల ముగింపు సందర్భంగా హోమం నిర్వహిస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ గుట్టపై శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఆలయంలో ఉదయం హోమం, పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శశిధర్, ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు తులసీ రెడ్డి మాట్లాడుతూ...ముగింపు సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం అన్నదానం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్, అర్చకులు ప్రహ్లాద, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మంగళవారం క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఖేడ్ మండలం బాణాపూర్‌కు చెందిన దుర్గయ్యకు రూ.60వేలు, ర్యాలమడుగుకు చెందిన అభిరామ్‌కు రూ.10వేలు, సత్తెగామకు చెందిన లక్ష్మయ్యకు రూ.లక్ష, కంగ్టి మండలం ఘన్‌పూర్‌కు చెందిన రాములుకు రూ.5వేలు, సిర్గాపూర్ మండలం గౌడ్‌గామకు చెందిన దేవిదాస్‌కు రూ.60వేలు మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ చౌహాన్, రవీందర్‌నాయక్, నవాబ్, చెన్‌బసప్ప తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన యువకుడికి సన్మానం



సిద్ధేశ్వర్‌ను సన్మానిస్తున్న యువకులు

మనూరు(నారాయణఖేడ్): మనూరు పట్టణానికి చెందిన యువకుడు లెక్చరర్ సిద్దేశ్వర్‌కు గణిత శాస్త్రంలో జేఎన్‌టీయూ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను ఇటీవలే పొందాడు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన వివేకనంద సేవా సమితి నాయకులు, స్థానిక యువకులు ఆయన్ను మనూరులో ఘనంగా సన్మానించారు. గణిత శాస్త్రంలో సైబర్ సెక్యూరిటీలో కంపౌండింగ్ విధానంలో చేసిన రీసెర్చ్‌కు డాక్టరేట్ అందుకున్నారు. ఆయన టీఎల్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగం, సిద్దారెడ్డి, రాజ్‌నందాలి, విఠల్, రాములు, ఓంప్రకాశ్, సంతోష్, నారాయణ, మోహన్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలను నివారించాలి



నగదు అందజేస్తున్న మమతఅశోక్ తదితరులు

రాయికోడ్(అందోల్): వేసవి కాలంలో సంభవించే అగ్ని ప్రమాదాలను నివారించాలని, తగిన జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ మమతఅశోక్, కర్చల్ మాజీ సర్పంచ్ గంప చంద్రశేఖర్ అన్నారు. కర్చల్ గ్రామంలో నిర్మలమ్మ కుటుంబాన్ని మంగళవారం వారు పరామర్శించారు. రూ.10,000లు ఆర్థిక సాయంగా ఆమెకు అందజేశారు. రాయికోడ్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి రూ.5,000లను బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్నిప్రమాదాల వల్ల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. విద్యుత్, వంట గ్యాస్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించి ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడివయ్య, స్థానిక నాయకులు జైరత్ ఖాన్, డి.పవన్‌కుమార్, జైపాల్‌రెడ్డి, కిషన్, చంద్రకళ, సంగమేశ్వర్, ప్రవీణ్, సంగన్న పాల్గొన్నారు.

అందోల్ నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడిగా రమేశ్



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

జోగిపేట(అందోల్): అందోలు నియోజకవర్గ కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు జి.మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు బురుగడ్డ నాగేష్ హాజరయ్యారు. అధ్యక్షుడిగా బైరన్ దిబ్బ రమేష్ (అల్లాదుర్గం), ప్రధాన కార్యదర్శిగా శంకరయ్య(మునిపల్లి) ఉపాధ్యక్షుడిగా మల్లయ్య(వట్‌పల్లి), గొర్లకాడి మల్లేశం (జోగిపేట), ఎల్ నాగభూషణం (రాయికోడ్), కార్యదర్శిగా కదాల రాములు (జోగిపేట), సహాయ కార్యదర్శిగా ఒగ్గు మోహన్ (మునిపల్లి), టి.మల్లేశం (చౌటకూర్), బస్వాపూర్ బీరప్ప (చౌటకూర్), ప్రచార కార్యదర్శి బండారి పాండు, ప్రచార సహాయ కార్యదర్శి పోతుల రాజు, కోశాధికారిగా గోపాల్(వట్‌పల్లి), సంఘం రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, గొర్ల కాపరుల మాజీ డైరెక్టర్ నవాబుగారి భూమయ్య, కృష్ణ, మల్లేశం పాల్గొన్నారు.

జిల్లా యూత్ ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్

జిల్లా కురుమ యూత్ ఉపాధ్యక్షుడిగా జోగిపేటకు చెందిన గూడెపు చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నగేష్, జిల్లా కురుమ సంఘం నాయకులు సాయికుమార్, భూమయ్యలతో పాటు పలువురు అభినందించారు. జిల్లా యువజన విభాగంలో అవకాశం కల్పించినందుకు చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

జాగృతం చేసేందుకే 'ప్రజా గోస బీజేపీ భరోసా'



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే

సదాశివపేట(సంగారెడ్డి): బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలను జాగృతం చేసేందుకే ప్రజా గోస బీజేపీ భరోసా నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి నియోజవర్గ బీజేపీ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 170, 171, 172 పోలింగ్ భూత్‌ల పరిధిలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని, ప్రజలందరూ బీజేపీకి ఓటేసి మద్దతివ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదోనని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారని గుర్తు చేశారు. రైతులకు రుణమాఫీ, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మాణిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల అరెస్ట్



బీజేపీ నేతలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

జహీరాబాద్: వికారాబాద్ జిల్లా తాండూర్ బీజేపీ నాయకుడు మురళీకృష్ణాగౌడ్‌ను పరామర్శించేందుకు వెళుతున్న జహీరాబాద్‌కు చెందిన పార్టీ నేతలను మంగళవారం అరెస్ట్ చేశారు. మురళీకృష్ణాగౌడ్ ఇంటిపై బీఆర్‌ఎస్ గుండాలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడని, అతడిని పరామర్శించేందుకు జహీరాబాద్ నియోజకవర్గం బీజేపీ నాయకులు వాహనాల్లో తరలివెళుతుండగా మార్గమధ్యలో బంట్వారం పోలీసులు అరెస్టు చేయడం బాధాకరమని నాయకులు వాపోయారు. అరెస్టైన వారిలో బీజేపీ అధికార ప్రతినిధి సుధీర్ కుమార్, నియోజకవర్గం ఇన్‌చార్జి కె.జనార్దన్ రెడ్డి, మల్లికార్జున్ పాటిల్, ఏక్‌నాథ్‌పాటిల్, అడివన్న, విశ్వనాథ్‌యాదవ్, సంతోష్ పాలింకర్, ఓంకార్ యాదవ్, బస్వరాజ్, నార్సప్ప, పద్మరావు, దయానంద్, పవన్, హర్షత్, వర్ధన్, సంపత్, చందు ఉన్నారు.

చట్టసభల్లో ప్రాతినిధ్యంపై ఒత్తిడి తెస్తాం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు నగేశ్

జోగిపేట(అందోల్): వచ్చే ఎన్నికల్లో జిల్లాలో రెండు ఎమ్మెల్యే స్థానాలను కురుమ కులస్తులకు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలకు డిమాండ్ చేస్తున్నట్లు జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు బురుగడ్డ నగేష్ అన్నారు. ఈ నెల 26వ తేదీన సంగారెడ్డిలో నిర్వహించతలపెట్టిన కురుమ సభ వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సభకు జిల్లా వ్యాప్తంగా పదివేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, అందోలు నియోజకవర్గం నుంచి 3వేల మందిని తీసుకురావాలని స్థానిక నాయకులకు ఆయన సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి హరీష్‌రావుతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరవుతారన్నారు. రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యాక్షుడు జి.మల్లయ్య, జిల్లా నాయకులు సాయికుమార్, నవాబుగారి భూమయ్య, కృష్ణ, సంగమేశ్వర్‌లతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఖేడ్ నుంచి యాదాద్రికి దిండి యాత్ర



కాశీనాథ్ మందిరం నుంచి యాదాద్రికి ప్రారంభమైన దిండి యాత్ర

నారాయణఖేడ్: జగద్గురు రేణుక చారిల జయంతిలను పురస్కరించుకొని నారాయణఖేడ్ కాశీనాథ్ ఆలయం నుంచి మంగళవారం జంగమ సమాజం బాధ్యులు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గురు రేణుకా చారిల జయంతి సందర్భంగా నారాయణఖేడ్ నుంచి యాదాద్రి జిల్లా కొలనుపాకలోని రేణుకచారిల దేవాలయం వరకూ సద్గురు మహాదేవ్ స్వామి ఆధ్వర్యంలో ఈ పాదయాత్రను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, జంగమ సమాజం బాధ్యులు శివకుమార్, రేవణయ్యస్వామి, శ్రీశైలం, రాజుస్వామి, విజయ్‌కుమార్ స్వామి, సిద్ధయ్యస్వామి, జంగమ సమాజం బాధ్యులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు ప్రభుత్వం నిర్వహించకపోవడం బాధాకరం



నివాళులు అర్పిస్తున్న వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

నారాయణఖేడ్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలను ప్రభుత్వం తరపున నిర్వహించకపోవడం బాధాకరమని పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. మంగళవారం ఖేడ్ అంబేద్కర్ భవన్ ఎదుట మాజీ జెడ్పీటీసీ రవికుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుధాకర్, బీజేవైఎం అధికారప్రతినిధి సతీష్‌కుమార్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అతిగే జీవన్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి భీమన్న, కాంగ్రెస్ నాయకులు కృష్ణ ఆయా పార్టీలు, వివిధ ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకులు తుకారాం, నర్సింహులు, ఆనంద్, సురేష్ నాయక్, అబ్దుల్ రహీం తదితరులు సాయన్న ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలి

సంగారెడ్డి టౌన్: ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని సీపీఎం నాయకులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రామచంద్ర రెడ్డి కాలనీలో సర్వే నెంబరు 403లో అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ భూమి ఉందని దాన్ని కొందరు ఆక్రమించారన్నారు. ఈ మధ్యకాలంలో కొంత భూమిని అంగనవాడీ సెంటర్‌కు కేటాయించగా మరి కొంత భూమిని అధికార పార్టీకి చెందిన నాయకులు ఆక్రమించుకొని తన ప్రైవేట్ సైన్యంతో కాలనీ వాసులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆయన పేర్కొన్నారు. తక్షణమే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా ఇలాంటి నాయకులను బీఆర్‌ఎస్ నుంచి బహిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణ, అశోక్, మల్లేష్, వీరమని, రజిత, మల్లేష్, వీరేశం, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్ప నగేశ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేశ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డినగర్ కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలోని సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెన్నవరం రాజేశ్వర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవింద్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ కుమార్ గౌడ్, కాలనీవాసులు తడుక నాగభూషణం, జగన్నాథ్ రెడ్డి, విట్టల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వాసుదేవ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్టులు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సంగారెడ్డి టౌన్: జిల్లా కేంద్రాల్లో సైన్స్ టాలెంట్ టెస్టులు నిర్వహించామని మరెల్లి రమేశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ జిల్లా విద్యాధికారి సమక్షంలో మండల, జిల్లా కేంద్రాల్లో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించామని వారు పేర్కొన్నారు. విజేతలకు అవార్డులు మెమెంటోలు ప్రదానం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరెల్లి నక్కరమేష్, జిల్లా సైన్స్ అధికారి విజయకుమార్, ఉపాధ్యాయులు నర్సింలు, మల్లికార్జున్, శివశంకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **11 మందికి కోవిడ్ టెస్టులు**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయిం. మంగళవారం 11మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు. అదే విధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు ఎనిమిది మందికి నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

◆ **ఇచ్చిన హామీ ప్రకారం రుణామాఫీ చేయాలి**

మునిపల్లి(అందోల్): ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీ నెరవేర్చాలని మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి సీఎం కేసీఆర్‌ను మంగళవారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు బ్యాంకులో తీసుకున్న రుణాలన్నింటినీ మాఫీ చేసి ఆదుకోవాలన్నారు. రుణమాఫీ చేస్తామని చెప్పి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ రుణమాఫీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ **ఇంటి పన్ను చెల్లించాలంటూ నోటీసులు జారీ**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు చెల్లించాలని రెడ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ మాట్లాడుతూ ఒకే కాలనీలో ఇంటి పన్నుల విషయంలో వ్యత్యాసం ఉందని తెలిపారు. ఈ వ్యత్యాసంపై అధికారులు సమాధానం ఇవ్వాలని ఆయన కోరారు.

◆ **సస్పెన్షన్‌ను రద్దు చేయాలని నిరసన**



జోగిపేట(అందోల్): ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను రద్దుచేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అందోలు మండల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. తక్షణమే అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని వారు కోరారు. బుధవారం తదుపరి కార్యాచరణను చేపట్టేందుకు ఉపాధ్యాయ సంఘాలు నిర్ణయం తీసుకోనున్నట్లు జిల్లా పీఆర్‌టీయూ నాయకులు జంగిటి అనిల్‌కుమార్ తెలిపారు.

◆ **రేపు ముదిరాజ్ భవన్ ప్రారంభోత్సవం**

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలంలోని నమ్లిమేట్ గ్రామంలో ముదిరాజ్ భవన్‌ను గురువారం ఉదయం 11.15గంటలకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రారంభిస్తారని సంఘం అధ్యక్షుడు సాదుల విఠల్ ముదిరాజ్ తెలిపారు. గౌరవ అతిథులుగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు, బీఆర్‌ఎస్ నాయకులు నీలం మధు తదితరులు హాజరవుతారని తెలిపారు.

◆ **సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ**



జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అందజేశారు. అందోలులోని క్యాంపు కార్యాలయంలో ఇద్దరు లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎస్.శ్రీధర్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

◆ **నేటి నుంచి 28వరకు ఉచిత నట్టల నివారణ**

సంగారెడ్డి టౌన్: నేటి నుంచి 28వరకూ జిల్లాలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణా కార్యక్రమం చేపడుతున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంత కుమారి తెలియజేశారు. జిల్లాలోని 28 మండలాలలో 73 బృందాలు ప్రతి గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

◆ **ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి**

నారాయణఖేడ్: విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఎంచుకొని చదువుకోవాలని సత్యసాయి సేవా సంస్థ జిల్లా కన్వీనర్ శంకరప్ప అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ధృవపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సత్తా చాటిన వారికి ధృవపత్రాలు అందిస్తున్నామన్నారు. విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకొని చదువుల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పామ్యానాయక్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

◆ **కనీస వేతనాలు ఇవ్వాలి**



మనూరు(నారాయణఖేడ్): మిషన్ భగిరథలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. మంగళవారం బోరంచలో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండావిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగిరథ కార్మికులకు కనీసం రూ.26వేలు చొప్పున వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ నాయకులు చిరంజీవి నాయకులు సిద్ధప్ప, సుదర్శన్, బీరప్ప, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నల్లపోచమ్మను దుర్గామాతగా అలంకరణ**



నారాయణఖేడ్: మనూరు మండలం, బోరంచ శివారులోని శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో పోచమ్మ అమ్మవారిని మంగళవారం దుర్గామాతగా అలంకరించారు. ఆలయ అర్చకులు సిద్ధయ్యస్వామి అమ్మవారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలతో సుగంధ పుష్పాలతో అలంకరించారు.